ఊహానాటిక

శ్రీ వలివేటి బాలకృష్ణశర్మ

# అంతర్ధానం

సమయం రాత్రి తొమ్మిదిన్నరా ఆ ముక్కని—నూతికి సమీపంగా బచ్చలిపందిరి—పందిరి ప్రక్కనే చిన్నకొయ్యకుకట్టి ఆవుదూడ గడ్డిమేస్తోంది. విశాలమైనవరండా. పాలగచ్చుమీద ప్రవహిస్తూన్న శరచ్చంద్రిక వెల్లువలో పిల్లగాలికి ఆకంపిస్తూ కొబ్బరి ఆకులు ఊగుతున్నాయి.

వెన్నెట్లో—నిర్మలంగా మంచంమీద ప్రక్కపరిచివుంది. ఆంధ్రగురు శ్రీగరుడాచార్యులవారు మంచం మధ్యను మఠంవేసుకుని కూర్చున్నారు. కింద్ర చాపమీద వెండిచెంబుతో మంచినీళ్లు. ప్రక్కన అండాళమ్మ—అంటే ఆచార్యులవారి తృతీయం—కూర్చుని, ఎదురుగా తమలపాకులబుట్టలోంచి విధీవిరామంలేకుండా ఒక్కొక్క ఆకూ నములుతూ, మధ్య మధ్య నాలిక బయటకు చాచి చూసుకుంటూంది.

గరుడాచార్యులవారు — యాభయిఏడోఏడు నడుస్తూంది. నిష్పత్తిలేని అవయవాల కూర్పు. రమారమి రెండున్నర టన్నుల బరువుగలిగి దానికి తగిన పొడవు వెడల్పులుగల తలకాయమీద గాలికి ఎగురుతూన్న రెండువెంట్రుకలూ—చెవులకు కుండలాలూ— ఇవీ బాహ్యాలంకారాలు—సిమ్మెంటుచేసిన నుదుటిమీద గంభీరంగా పంగనామాలు విమానపు రెక్కల్లాగ వుంటాయి.

అండాళమ్మ—పంధొమ్మిదేళ్ళ పాలపొంగులాంటి యవ్వనం బయటకొస్తోన్న వెన్నెల్లో ప్రతిఫలిస్తోంది. విశాలనేత్రాల్లో కుఱ్ఱతనమూ—విమల మందహాసంలో గగుర్పాటూ—నీనీల కుంతలాల్లో సగంజారిపోతూ జాజిపువ్వుల దండా—నుదుటిమీద వైష్ణవాంగనా సహజమైన తిలకమూ—మెడలో చంద్రహారాలూ—ఆకర్షణీయంగా వుంటాయి. నాలుగంగుళాల వెడల్పుగల నల్లంచుల ఖద్దరుచీర కట్టుకుని గ్లాస్కోరవిక తొడుక్కుంది.

ఆచార్యులవారు పొడుండబ్బీమీద తర్జనితో టొకాయించి—మొదటి మూడువేళ్ళతో ఒక్కపట్టుపీల్చి రెండవది చిన్ముద్ర ధరించి దీర్ఘంగా ఆలోచిస్తూ వుంటారు. ఆండాళమ్మ తనపనిలో మునిగి వుంది.)

గరుడా:—(ఆకాశంవైపుచూసి రెండుచేతులూ బారచాచి) హే పరమాత్మకా—జగద్రక్షకా—కృపాకా—వంకాయల మల్లయ్యశెట్టిగారు దయతో కరుణించి దానమిచ్చిన వెండి విశ్వరూపంతో జిగజిగా మెరుస్తూ—నాస్వహస్తాలతో వెలిగించిన అరసోలడు ఆముదపు దీపంముందర ప్రకాశిస్తూన్న—హే సచ్చిదానంద మూర్తీ — ఆర్తత్రాణపరాయణా — మరొచ్చిగంటె — మహానుభావా—శరణుశరణు....

అండా :—ఇస్స్! ఏమండోయ్. ఏమిటీఅల్లరి? అర్ధరాత్రివేళ ఇలా కిరెక్కిపోయి సంసారికొంపల్లో ఏమిటీ హంగామా? చక్కగా వెన్నెలకాస్తోంది. కులాసాగా మాటామంతీ చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తారా మీలాగ భామకలాపం చేస్తారా!

గరుడా :—(వినిపించుకోకుండా) ఏతద్గుణ సహస్ర పరంపరలతో విరాజిల్లుతూ వేంచేసినటువంటి.... ఓ పరమపురుషా.... ఇదుగోచూడూ నాచేత నైవేద్యం చేయబడిన అరటిపండు ముక్కతో ఆకలితీరిందా?

అండా :—ఏదీ—వెంటనే మీరే నోట్లో పడేసుకున్నారే!

గరుడా :—(తన ధోరణిలో) ఇంతభక్తి చూపిస్తూన్నటువంటి నామీద దయతలచి ఈమదీయ భార్యారత్నమువలన నాకొక్క సుపుత్రుడు కలిగేలాగ వరమివ్వరాదూ?

(పెరట్లో గభీమని పెద్దచప్పుడు-ఇద్దరూ అటువైపు చూస్తారు. అండాళమ్మ లేచినుంచుంది.

(ప్రవేశం—దేవుడు—నల్లగా—ఎత్తుగా—లావుగా ఆజానుబాహువూ—నుదుటిమీద తెల్లనినామాలూ, పట్టుబట్టలూ, తలమీద అట్టకిరీటం — భుజాలకి రెండుఅట్టచేతులూ మొదలయిన అలంకారాలూ—చేత్తో కాఫీఫ్లాస్కూ....)

గరుడా: —(లేచినుంచుని) ఎవరుబాబూ తమరు? టాకీలో వేషంవేసినట్టున్నారే?

దేవుడు :—గరుడాచార్యులూ—నీభక్తికిమెచ్చి

గరుడా :—ఓహో.... తెలిసింది తెలిసింది. తమరా....(సాష్టాంగ నమస్కారం చేసి) పెద్దకాలం! పోల్చలేకపోయను క్షమించాలి (కళ్ళుమూసుకుని దండం పెట్టి) లావొక్కింతయు లేదు....

దేవుడు :—అబ్బ! ఇంతసేపూ సంగీతంతో తల పగిలిపోయింది. కాసేపు నోరు మూత వేద్దూ....

గరుడా :—చిత్తం నిలబడిపోయారు. అలాగ అవధరించండి. (మంచం చూపిస్తాడు)

దేవుడు :—(కూర్చుని ఫ్లాస్కులో కాఫీ గ్లాసుతోతాగుతూ) ఇవాళ పేపరుచూశావా?

గరుడా :—పేపరా? ఎల్లప్పుడూ తమ నామాంకితంతో జపంచేస్తూ తమ ఆరాధనతో కాలక్షేపంచేసే భక్తుడికి పేపర్లూ పత్రికలూ ఎందుకుస్వామీ?

దేవుడు :—సరే బాగుంది. నీధోరణే నీదన్నమట. అయితే నీకూ ప్రపంచానికీ సంబంధం కించిత్తూ లేనట్టే

గరు:—చిత్తం. ప్రపంచానికే అన్నమాటేమిటి? నాకూ ఈశరీరానికే సంబంధం లేనప్పుడు? ఏది శాశ్వతంగనక?

దేవుడు :—అంటే ఏమిటి నీ అభిప్రాయం ? ప్రపంచంతోనూ శరీరంతోనూ సంబంధంలేని నువ్వు ఎందుకూ ఇలా బ్రతుకుతూ కరువు కాస్తఅభివృద్ధిచెయ్యడం, నీకు సంబంధంలేని ఈ శరీరంచేత రోజూ అంత పులిహోరా, అంత దధ్యోదనమూ, తినిపించకపోతే, శరీరంతో సంబంధముగల మరో ప్రాణి తిని తనూ శరీరమూకూడా సుఖిస్తారే!

గరు :—అన్నట్టు పులిహోర అంటే జ్ఞాపకం వచ్చింది. చూడూ అండాళూ, రాత్రి కైంకర్యంలో మిగిలిన పులిహోర శ్రీస్వామివారికి తీసుకురా! స్వామీ తమరు కాస్త కాళ్ళు కడుక్కుంటే....

దేవుడు :—(ఫ్లాస్కుతీసి కాఫీ గ్లాసులోపోసి గుటగుట త్రాగుతాడు)

అండా :—(వెండిపళ్ళెంలో పులిహోరా, చిట్టిగారెలూ, మొదలైనవీ, ఓ వెండిచెంబుతో నీళ్ళూ, వెండిగ్లాసుతో పాలూ తెచ్చి అక్కడపెట్టి దూరంగా నుంచుంటుంది)

దేవుడు :—(పళ్లెం తొడమీదపెట్టుకుని పులిహోర తింటూవుంటాడు)

గరుడా :—శ్రీవారు త్రేతాయుగంలో శబరి ఆతిధ్యాన్ని స్వీకరించారు, ద్వాపరంలో విదురుడియింట్లో విస్తరివేశారు. మళ్లా కలియుగంలో పరమభక్తుడినీ, మాంచి యిద్దైనవాడ్నీ అయినటువంటి....

దేవుడు :—నీభక్తికి నాభిదగ్గర్నుంచీ ఇంతకుపూర్వమే సంతోషించాను. ఇప్పుడు తెగసంతోషిస్తున్నాను. మున్ముందు మరీ గొప్పగా సంతోషించదలచుకున్నాను. కాని భక్తులంటే నా అభిప్రాయంలో కేవలం వెర్రివెంగళాయలన్నమాట. తెలిసిందా!

గరు :—కేవలం అంతేనండి. అసలు భక్తుడంటేనే వుత్త వెర్రివెధవ అయి వూరుకోవాలని శాస్త్రం.

దేవు :—అయితే నీలాంటిభక్తులు ప్రపంచంలో చాలామంది వున్నారే!

గరు :—వాళ్ళంత నిజమైన భక్తులాఅండి ? ఏదీ హఠాత్తుగా ఒక్కమాటు వెళ్ళిచూడండి. ఎలిమెంటరీ స్కూలుకన్నా అధ్వానంగా వుంటారు. తమకుమాత్రం తెలీదూ ?

దేవు :—అంటే నీకంటె వెర్రివెధవలు ప్రపంచంలో లేరంటావు ?

గరు :—ఢంకామీద దెబ్బకొట్టి మరీ అంటాను. ఈ ప్రపంచంలో తమపాదాలు తప్ప మరేముందండీ మట్టి ? ఏదో ఈగుక్కెడు ప్రాణాలూ తమ ఆరాధనకోసం వినియోగించి అంత్యమందు తమ సాన్నిధ్యంలోచేరి,—

దేవు :—ఆగు—అంత్యమంటే ఎన్నాళ్ళు ఇంకా నీగడువు ?

గరు :—అబ్బే—ఏముందండీ ఈ వెధవ ప్రపంచంలో నాబోటి భక్తుడికి కోరికలేముంటాయ్ గనక.... ఒక్కటీ—చూశారా ఆ నుంచున్న పెద్దమనిషిని....సర్వమూ తమకు తెలుసును అయినా చెప్పడం ఎందుకయినా మంచిది...ఆవిడని తీరా తొందరపడి మూడోపెళ్ళి చేసుకున్నాను. ఆవిడ నన్ను పెళ్ళాడేటప్పుడు ముందూ వెనకా ఆలోచించకపోబట్టి....ఇప్పుడు రోజూ పిల్లలు కావాలని నాప్రాణాలు కొరుక్కుతింటోంది. ఏంచెయ్యడమా అని పరీక్షపోయిన కుర్రాడిలాగ విచారిస్తూ దుఃఖిస్తూ, ఖేదిస్తూ రోదిస్తూ ఇలా కూచున్నాను. అంతకంటే కేవలం మానవుడినైన నేను ఏంచెయ్యగలను! ఇంతలో.... తమ దర్శనం ఇవాళో రేపో ఎలాగా కాకతప్పదనీ....తమముందు నాగోల కాస్త ఏ కరువుపెట్టుకుంటే....

దేవు :—చూడూ ఆచార్లూ—నీ అభిప్రాయం స్పష్టంగా చెప్పాలి!

గరు :—నాకేం అభిప్రాయం వుంటుంది గనక—తమరు నన్ను బ్రతికిస్తున్నారు గనక బ్రతుకుతున్నాను....ఎప్పుడు తమ సెలవైతే అప్పుడు....వెంటనే....

దేవు :—అవతారం చాలిస్తావు. వెంటనే చాలించు. ఎందుకూ నీవంటి వాడు ఇంకా బ్రతకడం. నీవల్ల నీకా ఉపయోగం లేదంటావ్. ప్రపంచం ఎలావుందో నీ కవుసరంలేదు. పోనీ కట్టుకున్న భార్యకయినా ఉపయోగంలేదు. కాని అబ్బాయ్....ఆచార్లూ... నీ శరీరానికీ నీకూ సంబంధంలేదన్నావే ఇప్పుడు మరో నీ భార్యా శరీరానికీ ఎందుకూ ఈ సంబంధం చెప్పు ?

గరు :—నాచేతులో ఏముంది స్వామీ—ఇదంతా తమ లీల....తమ వినోదం....తమ మాయ....తమ....

దేవు :—ఛీ నోర్ముయ్ ! రోజూ పీకమొయ్యా తిని గొంతుగ పగిలేలాగ అరిచి, భోగంమేళాలూ, నానావేషాలూవేసి, యోగ్యత లేకపోయినా పెళ్ళిళ్ళతర్వాత పెళ్ళిళ్ళుచేసుకుంటూ చివరకు నామీద ఈకర్మమంతా త్రోసి, నేనే చెయ్యమన్నట్టుగా—నా లీల—నా వినోదం—నా మాయ—అంటావు ? ఏమిటీ వికారం ? బొత్తిగా భయం భక్తీ లేకుండా నా ముందేనా ఈ కారుకూతలు ?

గరుడా :— తమరు క్షమించాలి. ఇదంతా నా కల్పితం కాదు. కేవలం గ్రంధాలు....శాస్త్రాలు....

దేవు :—చాలు, వెర్రి గ్రంధాలు ! చేతికొచ్చినట్టూ నువ్వూ వ్రాయి గ్రంధాలు, పెద్ద పంగనామాల్లాగ బిరుదులు తగిలించుకుని తిన్నతిండి జీర్ణంకాక అరుపులూ, కేకలూ, గ్రంధాలూ....

గరు :—అయితే సదరు మహాపుస్తకాలూ వగైరాలన్నీ వుత్తవెధవ గ్రంధాలనే తమ అభిప్రాయమా ?

దేవు :—మహారాజులాగ ! నాకు రెండుచేతులువుంటే నాలుగు చేతులని ప్రచారంచేశారు— అంచాత ఈ వెధవ అట్టచేతులు (తీసి క్రిందవిసిరి) తగిలించుకోకపోతే నాపేరు దేవుడు కాదంటారుగదా అని ఈ యూనిఫారమంతా మొయ్యవలసి వస్తూంది. ఒకడు నాకు రూపంలేదంటాడు, మరోడు నేను నల్లగా, పొడుగ్గా తనకి నిత్యమూ దర్శనమిచ్చానంటాడు. నాకు బ్రతికున్నంతకాలమూ మీసంలేదని నిర్ణయించి పేడిమూతి చేశారు. ఒకడు కనపడ్డ ప్రతివస్తువలోనూ నేనే దూరి కూచున్నానంటాడు. మరొకడు ఎక్కడో దర్జాగా ఆదిశేషువుమీద సముద్రంలో పడుకున్నానంటాడు. ఇంకోడు వైకుంఠపురంలో నగరిలో--అమూలసౌధంబు దాపలమందార వనాంతరామృత సరఃప్రాంతొదుకాంతో పలోత్పల పర్యంక రమావినోదినై—నవాబుగారిలాగ హుక్కాపీలుస్తూ కళ్ళు కనపడకుండా ప్రపంచంతో నిమిత్తంలేకుండా పడి ఏడుస్తున్నానంటాడు. ఇదంతాచూస్తే నేను ఎలావుంటానో నాకే తెలీకుండావుంది.

గరు :—తమకేం ! తమరు మహారాజులావున్నారు ! అయితే తెలియకడుగుతాను. ఈ వైకుంఠం—పాలసముద్రం—ఆదిశేషువూ—ఇవన్నీ కేవలం అబద్ధాలనే అంటారా ఏమిటి స్వామీ !

దేవు :—ఏమో ! నాకేమీతెలీదు ! నిజంగా నీలాగే నేనూ పుస్తకాల్లోనే చదవడం.

గరు :—అయితే తమ బస ?

దేవు :—నాకు బసకూడా ఎందుకోయ్ !

గరు :—అయ్యో నాతెలివా ! అవును సుమండీ ఇన్నిదేవాలయాలూ ఇంతమంది భక్తులూ వుంటూవుంటే....

దేవు :—అవన్నీ నాపేరుమీద బ్రతికే మీబోటి ప్రపంచాన్ని మోసగించే విషపురుగుల ఘోరకార్యాలకేగాని నాకోసంకాదు.

గరు :—మహాప్రభూ తమరు సి. ఐ. డీ. లాగ వున్నారు. (లేచి సాష్టాంగపడి) పొరపాటుని చాలాప్రశ్నలు అడిగాను చాలా శ్రమపెట్టేను. మరి తిట్టకండి. కొడితే (లేచినుంచుని) ఒక్క చెంపకాయకొట్టండి.

దేవు :—కొట్టడమేకాదు. నిలువునా దహనం చెయ్యాలి. నువ్వు చేసే ప్రతీవెధవపనికీ నేనా జవాబుదారీ ? నిజంచెప్పు. గర్భగుడిలో నాముందర నేను నోరులేని రాతిబొమ్మనిగదా అని నువ్వు ఎంతలేసి ఘోరాలుచేశావు ? అవన్నీ నేచూడలేదనుకున్నావా ? (క్రిందసున్న వెండిచెంబుతీసి దూరంగా విసిరి) ఆ వెండిచెంబు ఎన్ని అబద్ధాలూ, అప్రమాణాలూచేసి నా పేరుమీద ఎందరి అమాయకుల రక్తంపీల్చి సంపాదించావ్. నిజంచెప్పు.

అండా :—(చురచురచూస్తూ) ఇదేమిటండోయ్, వెధవదేవుడులా వున్నాడు ! మానాన్న రెండువందలుపెట్టి కాకినాడలో కొని పెళ్ళిలోపెట్టిన చెంబు పట్టుకుని....

గరుడా :—(గబగబాలేచి ఆమెనోరు ఒకచేత్తోనొక్కి) నోర్ముయ్ వెధమ్మొండా....శ్రీవారికి ఆగ్రహంవచ్చి ఆయనేడుస్తూ వుంటే మధ్య నీ అల్లరేమిటి? తీసుకురా...హారతికర్పూరం..

అగరు వత్తులు....సాంబ్రాణి....బొగ్గులకుంపటి....అగ్గిపెట్టె ....విసినకఱ్ఱ....

అండా :—ఆ ! పట్టింది, ఆగ్రహం రానీండి మరణం రానీండి ఇదుగో....మీరు ఇంకా నసుగుతూ వీధి వెనక తాళం వెయ్యక వీధిచివర్న నేపాళంవైద్యుణ్ణి పిల్చుకురండి రెండువాతలు వేసిపోతాడు.

దేవు :—ఇదుగో....ఆచార్లూ

గరు :—చిత్తం.

దేవు :—ఏందారోయ్ ?

గరు :—ఏముంచుకొచ్చింది స్వామీ? ధూపం వేయించనా?

దేవు:—నువ్వు రేపటినుంచీ దేవాలయంలో పూజారిత్వం మానెయ్యాలి?

గరు :—(నసుగుతూ) తమసెలవుకి అభ్యంతరం లేదుగానండి.... తాతలదగ్గరనుంచీ వస్తూన్న యీవృత్తి ఇప్పుడు ఎలా మానుకునేదీ అని ఆలోచిస్తున్నాను. కాకా మరోవృత్తి ఏదీ చాతకాదు. చివరికి మాష్టరీ ట్రయినింగయినా పాసుకాలేదు. జీవనాధారం కోసమయినా ఈ పని చేయ్యకపోతే నామాటకేంగానండి....ఇదుగో....నాభార్య వుందే దీన్ని ఎలాపోషించేదీ అని !

దేవు :—ఈ భార్యవల్ల నీకేం ఉపయోగంవుంది?

గరు:—ఒకటేమిటి? ఇదిసాక్షాత్తూ....కొత్తవారుగనుక తమదగ్గర అలావుందిగాని....లక్ష్మీదేవి తాతలాంటిదే అంటే నమ్మండి.

దేవు :—ఆ లక్ష్మీదేవి....ప్రతిబొమ్మలోనూ నా కాళ్ళుపడుతూ. ప్రతి సినిమాలోనూ నాపాదాలమీదనే ఏడుస్తూన్న ఆ లక్ష్మీదేవి... నాకు నెలకోసారి కనబడుతూ వుంటుంది. నమ్ముతావా? దానికీ ఒకలక్షమంది భక్తులూ—స్నేహితులూ....

గరు:—చిత్తం చిత్తం బోలెడంత ప్రాక్టీసు. తమరు పూర్తిగా భక్తపరాధీనులు. నా భార్యకూ ఓ పదిమంది స్నేహితులున్నా భక్తులుమాత్రం నేను తప్ప మరెవ్వరూలేరు.

దేవు: —అయితే నువ్వు నీ అర్చకత్వం మానదలచుకోలేదన్నమాట.

గురు :—తమరు ఆగ్రహించకండి. ఏమయినా లోపాలువస్తే సెలవియ్యండి. ఊళ్ళో నేనంటే భయపడనివాడూ గౌరవించనివాడూ, నాఅంత గటిగా పురాణం చెప్పగల్గిన మొగవాడూ, నా అంత బరువు మొయ్యగల ఆడదీ లేదు. ఈ అట్టకిరీటం తీసెయ్యండి. బంగారంతో మరో కిరీటం తయారుచేయించి యిస్తాను. అంతేగాని తొందరపడి నన్ను కలతపెట్టి మీరు కడుపుకాల్చుకోకండి. బుద్ధితెచ్చుకోండి.

దేవు :—గరుడాచార్లూ ! ఇవన్నీ నాకిష్టంలేదోయ్. ఈమధ్య నామీద ప్రపంచంలో గొడవలు చాలా పెరుగుతున్నై. అంచాత ఎవడికీ కనబడకుండా ఓమూల పడి కూచున్నాను. నువ్వు చాలా అమాయకుడివీ, పెద్దవాడివీ, మంచివాడివీ, గనక నీకు ఇలాగ దర్శనమిచ్చాను గాని ఏపెంకి కుఱ్ఱాడయినా చూస్తే నన్ను నానాప్రశ్నలూవేశి జవాబు చెప్పలేకుండాచేసి నానోరుమూసి నన్ను డబ్బాకొట్టడూ ? ఇప్పుడు ప్రపంచం మురుగుదొడ్డికన్నా అర్థానంగా వుందిగదోయ్ !

గరు :—చిత్తం. ఓమాట మాత్రం మరిచిపోకండి. ఏభయిఏళ్లు దాటినవాడికిగాని తమరు దర్శనమివ్వకండి. అలాంటి వయోనిర్ణయం పెడితేగాని లాభంలేదు. —

దేవు :—అసలు ఊళ్ళో తిరగడమే మానుకున్నానోయ్.

గరు :—ఇంకా తగ్గించుకోవాలి. పోనీ మాయింటో ఓగది అద్దెకిస్తాను. అందులో కాపురముంచకూడదూ. దొడ్లో పెద్ద గిలకనుయ్యి—నూతిలో తియ్యనిమంచినీళ్ళు—

దేవుడు :—(కిరీటం బయటకితీసి నేలమీదపెట్టి కాళ్ళు టపటపా కొట్టి మంచంమీద పడుక్కుని ఆవలిస్తాడు.) ఆచార్లూ— నీదగ్గర ఒకచుట్ట—బీడీ....సిగరెట్ ఏదయినా....

గరు :—లేదుస్వామీ : చూడూ అండాళూ కాస్త మంచినూనెరాసి కాళ్లుపట్టకూడదూ—పాపం తిరిగి తిరిగి వచ్చినట్టుంది స్వామివారు.

అండాళు :—వెధవస్వామివారు ! మణుగు పులిహోరా, బుట్టెడు చిట్టిగార్లూ తిని అర్ధశేరు పాలు తాగేసరికి కాళ్ల లాక్కొచ్చాయి కాబోలు శయనించారు. మీ రంగనాయకిని పిలవండి చెరో పక్కా కూచుందురు గాని.

దేవు: —రంగనాయకంటే నల్లగా లావుగా వుంటుందిగదోయ్. ప్రతీ ఆదివారం ఆలయంలో సేవచేస్తుంది ?

గరు: —చిత్తం తమరెక్కడ? చాలా విషయాలు తెలుసునండోయ్. తమకళ్ళు కేవలం గాజుకళ్ళనుకునేవాడిని. మొద్దులాగ నుంచుని నేను కట్టించిన కుళ్ళుగుడ్డలే కట్టుకుని హారతిపొగ పీలుస్తూ అలా నిల్చునేవారు.

అండా: —వీడు కొంపలోంచి మరి కదిలేలాగ కనపడదు. ఇల్లరికపు అల్లుడులాగ దర్జాగా పక్క వేశాడు.

గరు :—(ఆమె వేపుతిరిగి) ఇదిగో....ఆయన మర్యాదస్తుడు మన కొంపలో చిరకాలం వుండేవాడుకాడు. అంతగా వుంటానంటే మొన్న తెలుగుమేష్టరు ఖాళీచేసిన వీధిగది అద్దెకిస్తాను.

(నెమ్మదిగా లేచినుంచుని) అప్పుడే స్వామివారికి నిద్దర పట్టిపోయింది....స్వామీ (దేవుడు గురకలెడుతున్నాడు) ఇదుగో ....వీడివల్ల మనకి ఎన్నిలాభాలున్నాయో తెలుసా? ఈ రాత్రి తెల్లవారేలోగా వీడు పోకుండా మల్లయ్యశెట్టినీ, నాగరత్నాన్నీ ఈడ్చుకు చక్కావస్తాను. ఇలాగ రెండురాత్రులు దేవుడు మనింటో పులిహోర తిని, మంచంమీద పడుకుంటే—ఊః....మూడుఘడియల్లో బంగారం గోడలు పెట్టించనూ?

నువ్వు ఇక్కడేనుంచో! ఆయన అయింతా మెలకువ రాగానే అంతర్ధానమే అయిపోతాడో, లేచిపోతాడో....ఏమో జాగ్రత్త అలాంటిదేమీ జరగనివ్వకు. దేవుడంటే ప్రాణంపెడతాడు మల్లయ్యశెట్టి; ఒక్కమాటు ఏర్పనం చేయిస్తాను, వెళ్ళనా?

అండా :—వెళ్ళండి గాని ఇక్కడున్నట్టు రావాలి. దొంగముండాకొడుకు, మీరు లేకపోవడంచూసి ఏం ఘోరంచేస్తాడో!

గరు :—(లెంపలు వాయించుకోని) తప్పు తప్పు ఆయనదేవుడే! అయినా ఇక్కడున్నట్టు రానూ?

అండా :—అంతా దేవుళ్ళూ, దేవతలే. ఇదుగో శెట్టిగారిభార్య. మెళ్ళో చంద్రహారాలు చాలా బాగున్నయండీ.

గరు: —అవి శ్రీవారు కోరుతున్నారని చెప్పి తేపు ఉదయానికి నీ మెళ్ళో దిగెయ్యనూ? (ఆచార్లువెళతాడు)

(తృటి నిశ్శబ్దం)

(ఇటూ అటూ చూసి అండాళమ్మ మంచంమీద కూచుంది)

అండా :—(దేవుడిమీద చెయ్యివేసి కదుపుతూ) ఏమండోయ్ లేవండిమరి! అప్పుడే నిద్దరా?

దేవుడు : —(దిగ్గునలేచి అండాళమ్మకి ఎడమ ప్రక్కన కూచుని కుడి చేత్తో ఆమెనుపట్టి తుపాకీపేల్చినట్టు ఒక్కముద్దు పెట్టుకున్నాడు)

అండా:—ఆయన ఈధ్వనికి వెనక్కు రాడుగద!

దేవుడు :—(ఆమె తల నిమురుతూ) నీ మొగడు చాలా మంచివారు సుమా పాపం!

అండా:—మీబోటి దేవుళ్ళదగ్గర మాత్రం హడలు. కాని గొప్పగా నటించారే దేవుడు వేషం! వెండిచెంబు అలా విసిరి కొట్టారేం?

దేవు :—నయం వాడి మొహంమీద కొట్టివుందును.

అండా :—మాగదిలో అద్దెకుంటారా?

దేవు :—అన్నట్టు మరిచిపోయాను—రెయిలుకి టయిమయింది పెట్ట సర్దుకున్నావా?

అండా :—మీనాన్నగారితో ఏం జెప్పారు?

దేవు :—కాలేజీ రేపేతెరుస్తారనీ ఈరాత్రే వెళ్ళిపోవాలనీ చాలా కోశాను, లే మరి—తొరగా తెములు.

(అండాళమ్మ లోపలకివెళ్ళి ఓట్రంకుపెట్టితో తిరిగివస్తుంది. దేవుడూ—అండాళూ....నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ పెరటిదారిని నిష్క్రమణం—)

పక్షులు చెట్టుమీద రొదచేస్తున్నాయి. రెండునిమిషాలు గడిచినై.

ప్రవేశం—ఆచార్లూ—దూరంనుంచి నమస్కారాలతో—మల్లయ్యశెట్టీ భార్యా గులాబీపువ్వుల దండలు పట్టుకుని—మల్లయ్యశెట్టి తల గ్లోబుకి నల్లరంగువేసి నామాలు పెట్టినట్టుగావుంది.

మల్లయ్య } (కళ్ళుతెరవకుండా) మహాప్రభూ—స్వామీ—ఇన్నాళ్ళకి<br>
భార్య } దయకలిగిందా తండ్రీ—దండాలు....దండాలు—

(కళ్లుతెరిచి) ఏరీ....ఎక్కడా కనబడరేం?

ఆచార్లు :—(దిగాలుగా) ఏరీ! స్వామీ! ఏదీ....అండాళూ—వెధవ దేవుడు కొంపతీసి—

మల్లయ్య :—ఆచార్లుగారూ—తమరు గొప్పభక్తులు. తమకు శ్రీవారి దర్శనమైంది. మాకింకా పాపం పరిపక్వంకాలేదు ఆ మహాప్రభువు దర్శనమిస్తాడా? అంతర్ధానమైపోయారు.

ఆచార్లు :—ఉండవయ్యా వెధవగోల; ఈవెధవభక్తిలోపడి ప్రపంచ జ్ఞానంకూడా పోయింది.

మల్లయ్య:—చిత్తం భక్తి అంటేనే అదిగదండీ! మరి భక్తుడంటే వుత్త వెర్రి వెధవన్నమాట!!

ఆచార్లు :—నోర్మూయ్ ఫో ముందు (మల్లయ్యా — నాగరత్నం పరుగెడుతారు)

(ఆచార్లు మంచంమీద కూలబడతాడు.)

ఆచార్లు :—దేవుడు ఎంత రౌడీముండాకొడుకయిపోయాడు?

—'తెర'